సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



నిర్లక్ష్యం కొంప ముంచేనా?

కూటమి సర్కార్ నిర్లక్ష్యం భగత్‌సింగ్ కాలనీకి వరద ముప్పు పొంచి ఉంది. రెండేళ్ల తర్వాత పెన్నానదికి వచ్చిన స్వల్ప వరదకే స్థానికుల్లో వణుకు పుట్టించింది. -8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,14,000
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.10,260
3 శాతం జీఎస్టీతో	రూ.10,568
నవర (8 గ్రా)	రూ.84,544

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.9 /26.5

జిల్లాలో బుధవారం ఉరుములు, మెరుపులతో, ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. మంగళవారం గాలిలో తేమ 54 శాతంగా నమోదైంది.

ప్రశ్నించే కలానికి సంకెళ్లు అప్రజాస్వామికం



ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలిచి ప్రజల గొంతుకను వినిపించే పత్రికపై కక్ష పూరిత చర్యలు అప్రజాస్వామికం. పత్రికలపై దాడులు చేస్తూ అక్రమ కేసులు బనాయించడం కలానికి సంకెళ్లు వేయడమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఫోర్త్ ఎస్టేట్‌గా గుర్తింపు ఉన్న మీడియాపై కేసులు పెట్టడం సరికాదు. పత్రికా స్వేచ్ఛను హరిస్తే ప్రజాస్వామానికి ప్రమాదం వాటిల్లుతుంది. 'సాక్షి' ఎడిటర్‌తోపాటు ఆ పత్రిక జర్నలిస్టులపై నమోదు చేసిన కేసులను భేషరతుగా ఉపసంహరించుకోవాలి. పత్రికల్లో వచ్చిన వార్తలపై అభ్యంతరకరంగా ఉంటే వివరణ కోరాలే తప్పా అక్రమ కేసులు పెట్టి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడొద్దు. పోలీసులు సైతం ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు.

– ఖలీల్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ స్టేట్ మైనార్టీ సెల్ సెక్రటరీ



అక్కసుతోనే 'సాక్షి'పై అక్రమ కేసులు



ప్రజాస్వామ్య వ్యవస్థకు ఫోర్త్ పిల్లర్‌గా పిలిచే మీడియా వ్యవస్థపై అక్రమ కేసులు పెట్టడం సిగ్గుచేటు. కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పులను, మోసాలను వెలుగులోకి తీసుకొస్తుందన్న అక్కసుతోనే 'సాక్షి' పత్రికను ఇబ్బంది పెట్టేందుకు ఆ పత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డితోపాటు విలేకరులపై అక్రమ కేసులు బనాయించారు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని చెప్పాలి. పత్రికల గొంతు నొక్కి పత్రిక స్వేచ్ఛను అణచివేయాలని చూస్తే ప్రజా తిరుగుబాటు తప్పదు. అధికారంలోకి రావడానికి అడ్డమైన హామీలిచ్చిన కూటమి నేతలు.. ఇప్పుడు ఏ పథకాన్ని అమలు చేయకుండా మోసం చేస్తోంది. ఈ సమయంలో ప్రజల గొంతుకై వ్యవహరిస్తున్న 'సాక్షి' గొంతు నొక్కాలని చూస్తోంది. ప్రజలకు మంచి చేసి మెప్పు పొందాలే కానీ పత్రిక యాజమాన్యాలను బెదిరించడం మంచి పరిణామం కాదు.

– పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ

న్యూస్‌రీల్

సక్రమంగా 'పోషణ మాసం' కార్యక్రమాలు

నెల్లూరు (పొగతోట): అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ మాసం' కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ సీడీపీఓలను ఆదేశించారు. మంగళవారం ఐసీడీఎస్ కార్యలయంలో సీడీపీఓలతో నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడారు. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాలను ప్రణాళికల ప్రకారం నిర్వహించాలన్నారు. స్థూలకాయం నివారణ, చెక్కర, నూనెల వినియోగం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం, బాల్య దశ సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

• జెడ్పీ సీఈఓ మోహన్‌రావు



అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు నివాళులర్పించి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ మోహన్‌రావు

నెల్లూరు (పొగతోట): శిక్షణ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అవగాహన చేసుకుని గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు కోరారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో మహిళ జెడ్పీటీసీల, ఎంపీపీలు, సర్పంచ్‌లకు ఆర్‌జీఎస్‌ఏ యాక్షన్ ప్లాన్ 2025–26పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సీఈఓ మాట్లాడారు. మహిళ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించాలన్నారు. అభివృద్ధి పనులను యాక్షన్ ప్లాన్‌లో పొందుపరచాలని తెలిపారు.

సీఎం సమీక్షలో కలెక్టర్, ఎస్పీ



సమీక్షలో కలెక్టర్, ఎస్పీలు

నెల్లూరురూరల్: రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జరిగిన సమీక్షలో శాంతిభద్రతల అంశంపై ఎస్పీలు, కలెక్టర్లతో సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 66,066 మంది స్వామి వారిని దర్శించుకోగా 24,620 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.13 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 15 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల గడువు పొడిగింపు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించినట్లు బీడీ కార్మికుల సంక్షేమ సంఘ జిల్లా సీనియర్ మెడికల్ ఆఫీసర్ కేవీ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలోని బీడీ, సున్నపు రాయి, డోలమైట్, మైకా, ఐరన్ ఓర్, మాంగనీస్, సినీ కార్మికుల పిల్లలు 1 నుంచి 10వ తరగతి వరకు (ప్రీ మెట్రిక్) చదువుతున్న విద్యార్థులు ఉపకార వేతనాల కోసం ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, అగ్రికల్చర్, మెడికల్, ఐటీఐ (పోస్ట్ మెట్రిక్) చదివే విద్యార్థులు అక్టోబరు 31వ తేదీ లోపు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 040-2956 1297, హెల్ప్ లైన్ నంబరు 0120-6619540 ఫోన్ నంబర్లలో కానీ నగరంలోని జెడ్పీ కాలనీలో ఉన్న బీడీ కార్మికుల సంక్షేమ వైద్యశాల సీనియర్ మెడికల్ ఆఫీసర్‌ను సంప్రదించాలని కోరారు.

వరద వణుకు

భయం గుప్పెట్లో పెన్నాతీర గ్రామాలు

ఇసుకాసురులు పెన్నానదిలో సృష్టించిన విధ్వంసం.. తాజాగా వస్తున్న కొద్దిపాటి వరదకే వణుకు పుట్టిస్తోంది. ఇసుక అక్రమ రవాణా చేయడానికి వెళ్లిన మూడు ట్రాక్టర్లు నది గుంతల్లో కూరుకుపోయాయంటే ఏ స్థాయిలో దందా జరుగుతుందో అద్దం పడుతోంది. ఇసుక అక్రమ రవాణా కోసం ఎక్కడికక్కడ పొర్లు కట్టలు ధ్వంసం చేయడంతో భారీగా వరదొస్తే తమ పరిస్థితి ఏమిటని నదీ తీర ప్రాంత గ్రామాల ప్రజలు భయం గుప్పెట్లో బిక్కుబిక్కుమంటున్నారు. ప్రస్తుతం సోమశిల నిండు కుండలా ఉంది. రాబోయే అక్టోబరు, నవంబరులో కురిసే భారీ వర్షాలకు వచ్చే వరద పెను ముప్పును సృష్టించే అవకాశాలు ఉన్నాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో భారీ స్థాయిలో వరదొస్తేనే అనేక గ్రామాల్లో పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. గ్రామాలను నీట ముంచాయి. ప్రస్తుతం పొర్లుకట్టలు తవ్వేసి రోడ్లు వేయడంతో ఓ స్థాయిలో వరదొచ్చినా.. జలవిలయం తప్పదని ఇరిగేషన్ అధికారులు ఆందోళన చెందుతున్నారు.

• ఇసుక అక్రమ రవాణాకు ఎక్కడికక్కడ పొర్లు కట్టల ధ్వంసం
• గతంలో కట్టలు బలంగా ఉన్నా.. గ్రామాల్లోకి నీరు
• వరద ఉధృతి పెరిగితే ప్రమాదకరమని స్థానికుల ఆందోళన
• పెన్నాకు వరదొస్తున్నా.. ఆగని ఇసుక దందా
• విరువూరు, మినగల్లు రీచ్ గుంతల్లో కూరుకుపోయిన మూడు ఇసుక ట్రాక్టర్లు



విరువూరు వద్ద పెన్నానది వరదలో మునిగిపోయిన రెండు ఇసుక ట్రాక్టర్లు

పొదలకూరు : సోమశిల దిగువ నుంచి బంగాళాఖాతం వరకు సాగే పెన్నానదికి ఇరువైపులా పొర్లు కట్టలను అధికార పార్టీకి చెందిన ఇసుకాసురులు ధ్వంసం చేశారు. ఊరూరా ఏర్పాటు చేసుకున్న అనధికార రీచ్‌ల కోసం ఎక్కడికక్కడ పొర్లు కట్టలు తవ్వేసి రోడ్లేశారు. వరద ఉధృతి పెరిగితే తెగ్గొట్టిన కట్టల దగ్గర నుంచి ఊర్లను ముంచేసే ప్రమాదం ఉందని నదీ తీరంలోని గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతం అనుభవాల నేపథ్యంలో ఎప్పుడు ఎలాంటి ఉపద్రవం సంభవిస్తుందోనని భయపడుతున్నారు. ప్రస్తుతం వరద ఉధృతి పెద్దగా లేకపోయినా.. రాబోయే రెండు.. మూడు నెలల్లో పైతట్టు నుంచి ఒక్కసారిగా వరద వచ్చి సోమశిల ప్రాజెక్ట్‌పై పడితే భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు దిగువకు నీటిని విడుదల చేస్తుంటారు. 2021 నవంబర్‌లో ఎదురైనా పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని పెన్నా పరీవాహక ప్రాంతాల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అప్పట్లో మండలంలోని సూరాయపాళెం గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు వరద నీరు చేరడంతో గ్రామస్తులు వణికిపోయారు. విరువూరు, మహ్మదాపురం గ్రామాల పొలాల్లోకి వరదనీరు చేరి ఇసుక మేట వేసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనుపూరు కాలువ పాస్‌వేలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి.



ఇసుక తరలించేందుకు పొర్లుకట్టను తెగ్గొట్టారు..

కొట్టుకు పోయిన ట్రాక్టర్లు

పెన్నానదిలో గతేడాది నుంచి ఇసుక రీచ్‌లకు, తవ్వకాలకు అనుమతి లేదు. డ్రెడ్జింగ్ విధానంలో ఒకటీ.. రెండు చోట్ల అనుమతులు ఉంటే అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రుల కనుసన్నల్లోనే ఊరూరా అనధికారికంగా రీచ్‌లు నిర్వహిస్తున్నారు. అక్టోబరు రెండో వారం వరకు నదిలో డ్రెడ్జింగ్ విధానానికి కూడా అనుమతుల్లేకపోయినా.. అయినా విచ్చలవిడిగా ఇప్పటికీ తవ్వుతున్నారు. ఫలితంగా విరువూరు ఓపెన్ రీచ్‌లో వరద నీటిలో రెండు ఇసుక ట్రాక్టర్లు చిక్కుకుని పోయాయి. వరద ఉధృతికి కొంత దూరం కొట్టుకుని వెళ్లడం గమనార్హం. సోమవారం సాయంత్రం సంగం బ్యారేజీ వద్ద సైరన్ మోగించి 23 వేల పైగా క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. బ్యారేజీకు సమీపంలో విరువూరు రీచ్ నుంచి ఇసుకను తరలించేందుకు వచ్చిన కావలికి చెందిన ట్రాక్టర్లు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. అయితే ఇసుకను ట్రాక్టర్లకు నింపేందుకు వచ్చిన కూలీలు వరద ఉధృతిని పసిగట్టి హుటాహుటిన గట్టుకు చేరుకోవడంతో ప్రాణాలు దక్కించుకున్నారు.

ఇసుక తవ్వకాలతో కట్టలు బలహీనం

మండల పరిధిలోని పెన్నా తీరంలో సూరాయపాళెం, విరువూరు, మహ్మదాపురం గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ ప్రాంతంలో ఇసుక రీచ్‌లను నిర్వహిస్తున్నారు. మహ్మదాపురం గ్రామస్తులు చాలా రోజులుగా రీచ్‌ను నిర్వహించేందుకు వ్యతిరేకించడంతో సూరాయపాళెం వద్ద డ్రెడ్జింగ్ పద్ధతిలో, విరువూరు ఓపెన్ రీచ్ నిర్వహిస్తున్నారు. అయితే ఓపెన్ రీచ్‌కు జిల్లాలో ఎక్కడా అనుమతులు లేవు. డ్రెడ్జింగ్ విధానంలోనూ అక్టోబరు వరకు ఇసుక తవ్వకాలు చేపట్టొద్దని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సూరాయపాళెం వద్ద ఏకంగా డ్రెడ్జింగ్ పేరుతో పొర్లుకట్టను తెగ్గొట్టారు. కట్టలపైనే తాత్కాలికంగా రోడ్లను నిర్మించి ఇష్టానుసారం ఇసుకను తరలించారు. దీంతో పొర్లు కట్టలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని గ్రామస్తులు అంటున్నారు. సంగం బ్యారేజీకు అతి సమీపంలోనే ఇసుక తవ్వకాలు సాగించడం వల్ల పెనుముప్పు ఉందని హెచ్చరించినా పట్టించుకున్న వారు లేరు. పాత కట్టలను తెగ్గొట్టి ఇసుకను అదే మార్గం ద్వారా తరలించేవారు.



సూరాయపాళెం వద్ద పొర్లుకట్టపై మట్టిరోడ్డు నిర్మించిన ఇసుక కాంట్రాక్టర్లు

నదిలో ఇరుక్కున్న ఇసుక ట్రాక్టర్

• ఇసుక అక్రమ తవ్వకాలే కారణం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని మినగల్లు ఇసుక రీచ్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పెన్నానదిలో చిక్కుకుపోయింది. సోమవారం రాత్రి సోమశిల నుంచి పెన్నానదికి నీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. అదే సమయంలో అక్రమంగా నదిలో ట్రాక్టర్‌కు ఇసుక లోడు చేస్తున్నారు. ఒక్కసారిగా నీరు రావడంతో ట్రాక్టర్ నదిలో ఇరుక్కుపోయింది.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

నదికి నీరు వదిలిన సమయంలో పిల్లి రమేష్‌కు సంబంధించి ట్రాక్టర్‌కు ఇసుక లోడు చేశారు. ఒక్కసారిగా నీరు రావడంతో ట్రాక్టర్‌లో ఇసుక అక్కడే అన్‌లోడు చేశారు. అయినప్పటికీ నీటి వేగం, ఉధృతి పెరగడంతో డ్రైవర్ వెంకటరమణయ్య ట్రాక్టర్ వదిలి బయటపడ్డాడు. ట్రాక్టర్ అయితే టాప్ వరకు మునిగిపోయింది. అంటే దాదాపు 10 అడుగుల మేర గుంత కావడంతో ట్రాక్టర్ మునిగిపోయింది. దీన్ని బట్టి ఏ స్థాయిలో ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారో అర్థమవుతోంది.



మినగల్లు వద్ద నదిలో మునిగిపోయిన ట్రాక్టర్

భారీ ఎత్తున తవ్వకాలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్టోబర్ 15 వరకు ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు. అయినప్పటికీ టీడీపీ నాయకుల అండదండలు, పోలీసులకు మామూళ్లు ఇచ్చి గుట్టుచప్పుడు కాకుండా రాత్రిళ్లు యథేచ్ఛగా ఇసుక తరలిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. మినగల్లు, కాగులపాడు, జొన్నవాడ వద్ద టీడీపీ బుచ్చిరెడ్డిపాళెం రూరల్ అధ్యక్షుడి జగదీశ్ ఆధ్వర్యంలో రాత్రిళ్లు ఇసుక మాఫియా చెలరేగి పోతోంది. భారీ ఎత్తున తవ్వకాలు జరపడంతో నదిలో 15 అడుగల మేర గుంతలు ఏర్పడ్డాయి. వరద ఉధృతి ఇంకా ఎక్కువైతే సమీప గ్రామాలైన మినగల్లు, జొన్నవాడ, కాగులపాడు గ్రామాల ప్రజలకు తీవ్ర ముప్పు తప్పదు. ధన, ప్రాణ, ఆస్తి నష్టం ఊహించని రీతిలో సంభవించే అవకాశం ఉంది.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సోమశిలకు 23,234 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 23,234 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి క్రస్ట్‌గేట్ల ద్వారా పెన్నానదికి 14,850 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,450 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 73.450 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

బ్యారేజ్ నుంచి దిగువకు 27,800 క్యూసెక్కులు



బ్యారేజ్ నుంచి గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సంగం: సోమశిల నుంచి సంగం బ్యారేజ్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజ్ నుంచి 27,800 క్యూసెక్కుల వరద నీటిని ఇరిగేషన్ అధికారులు 26 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజ్ దిగువన ఉన్న పెన్నా పరీవాహక ప్రాంతాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. ఎవరూ పెన్నానదిలోకి దిగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

భారీగా వరదొస్తే.. జల ప్రళయం తప్పదు



పెన్నా పొర్లుకట్టలు ధ్వంసం చేశారు. ప్రస్తుతానికి వచ్చే వరద ఉధృతి వల్ల ఎలాంటి ఇబ్బంది లేదు. వరదలు చెప్పి రావు. ముందు ముందు భారీ స్థాయిలో వరద వచ్చే అవకాశాలు లేవని చెప్పలేం. సోమశిల నిండుగా ఉంది కాబట్టి కచ్చితంగా ఈ దఫా భారీ స్థాయిలో వరద వచ్చే అవకాశం ఉంది. గతంలో వచ్చినట్లు వస్తే జల ప్రళయం తప్పదు. 2021లో మా గ్రామ పొలాల్లో వరద వల్ల ఇసుక మేటలు వేశాయి.

– కే కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్, మహ్మదాపురం

గ్రామంలోకి నీళ్లొచ్చాయి



2021లో పెన్నా వరద వల్ల సూరాయపాళెంలోకి వరద నీరు వచ్చింది. గ్రామస్తులు భయపడిపోయారు. అప్పట్లో కరకట్టలు బాగానే ఉన్నాయి. కట్టలను మించిన స్థాయిలో వరదలు రావడంతో అధికారులు వ్యయ ప్రయాసలు పడి పొర్లుకట్టల ద్వారా నీరు రాకుండా ప్రయత్నించారు. అప్పటి ఘటన తలచుకుంటేనే భయం వేస్తోంది. ప్రస్తుతం ఎక్కడికక్కడ కట్టలు ధ్వంసం చేయడంతో వరద పెరిగితే ఏమిటని భయమేస్తోంది.

– డీ వెంకటరమణారెడ్డి, సూరాయపాళెం

పెన్నాతీరంలో టెన్షన్ టెన్షన్



పెరుమాళ్లపాడు వద్ద పెన్నానది పొర్లుకట్ట దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

ఆత్మకూరు: జిల్లా వరదాయని సోమశిల జలాశయం ఎగువన కురిసిన వర్షాలు, వరద నీటితో 74 టీఎంసీలకు చేరుకున్న నేపథ్యంలో రెండు రోజుల క్రితం 30 వేల క్యూసెక్కుల మేరకు దిగువ (పెన్నానది)కు విడుదల చేస్తుండడంతో ఆత్మకూరు నియోజకవర్గంలో పరిధిలోని గ్రామాల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. జలాశయం నుంచి అనంతసాగరం, ఆత్మకూరు, చేజర్ల సంగం మండలాల మీదుగా పెన్నానది ప్రవహిస్తోంది. చేజర్ల మండలం పెరుమాళ్లపాడు, ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం, సంగం మండలం వీర్లగుడిపాడు గ్రామాలు పెన్నా పరీవాహక గ్రామాలు కావడంతో అక్కడ ఉన్న పొర్లుకట్టలు దెబ్బతిని ప్రమాదకరంగా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అధికార పార్టీ ఇసుకాసురుల నది కరకట్టలు ధ్వంసం చేయడంతో చిన్నపాటి వరద ఉధృతికి స్థానికులు వణికిపోతున్నారు. ఇదిలా ఉండగా పెన్నానదిలో భారీగా ఇసుకను తరలించడంతో ఏర్పడిన గుంతలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. 2021లో వచ్చిన వరదలకు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలు, కాలనీలు నీటమునిగిన విషయం గుర్తు చేసుకొని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వీర్లగుడిపాడు గ్రామమైతే ఏకంగా జలదిగ్బంధంతో చిక్కుకోవడంతో అప్పటి మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పడవల ద్వారా వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం పెరుమాళ్లపాడు సమీపంలో పెన్నానది పొర్లుకట్టలు పలు చోట్ల ధ్వంసం చేసి ఉండడంతో వేలాది క్యూసెక్కుల నీటికి పొర్లుకట్టలు తెగి గ్రామంలోకి నీరు చేరుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిహారమిచ్చి పనులు చేపట్టండి

కలిగిరి: నష్టపరిహారం అందించిన తర్వాతే తమ భూముల్లో నేషనల్ హైవే నిర్మాణ పనులు చేపట్టాలని పలువురు రైతులు, లబ్ధిదారులు కాంట్రాక్టర్లకు తెల్చి చెప్పారు. కలిగిరి సమీపంలో వింజమూరు మార్గంలో జరుగుతున్న ఎన్‌హెచ్ 167బీజీ నిర్మాణపు పనులను మంగళవారం పలువురు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ భూసేకరణ సమయంలోనే తమకు న్యాయమైన నష్టపరిహారం మంజూరు చేయలేదని అప్పట్లోనే 11 మంది అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మార్కెట్ విలువ ప్రకారం సెంట్‌కు రూ.4.76 లక్షలు రావాల్సి ఉండగా రూ.35,600 మాత్రమే మంజూరైందన్నారు. అప్పట్లో తాము నోటీసులు కూడా తీసుకోలేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్ వద్ద విచారణ జరుగుతుందన్నారు. తమకు ఇంత వరకు నష్టపరిహారం అందలేదని, తమ స్థలంలో రోడ్డు నిర్మాణపు పనులు చేపట్టరాదని సూచించారు. దీనిపై హైవే నిర్మాణ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ నష్టపరిహారం విషయం కలెక్టర్ పరిధిలో ఉందన్నారు. అక్టోబరు 15వ తేదీలోపు రోడ్డు నిర్మాణపు పనులు పూర్తి చేయాలని తమకు నిబంధనలు ఉన్నాయన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఎవరికీ సమస్యలు లేకుండా రోడ్డు నిర్మాణపు పనులు చేపడుతామని తెలిపారు.



రోడ్డు నిర్మాణ పనులు నిలిపేసిన లబ్ధిదారులు

అక్రమ నిర్మాణాలను వదిలేసి..

• టౌన్‌ప్లానింగ్‌లో ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

నెల్లూరు (బారకాసు): నగర నడిబొడ్డున, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం కొనసాగుతున్నా.. కార్పొరేషన్ అధికారుల కళ్లకు కనిపించలేదు. ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ఇటీవల మేయర్ స్రవంతి స్వయంగా వెళ్లి ఆ నిర్మాణాన్ని పరిశీలించారు. అనుమతులు లేకుండా ఇక్కడ నిర్మాణాన్ని ఎలా నిర్మిస్తున్నారని, దీనిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఆమె మండిపడ్డారు. సంబంధిత అధికారులు అనధికార నిర్మాణాన్ని తొలగించకుండా టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించిన కింది స్థాయిలోని ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో కనకమహల్ థియేటర్ ఖాళీ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండానే ఇనుప గడ్డర్లతో రెండంతస్తుల నిర్మాణాన్ని చేపడుతున్నారు. అయితే ఈ విషయం తెలిసి కూడా సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం. ఇందుకు సదరు నిర్మాణదారుల నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే నగరంలోని వెంకట్రామాపురంలో మూడు బహుళ అంతస్తుల భవనాలు పరిమితికి మించి నిర్మాణాలు చేపట్టారని, వాటిని భారీ క్రేన్లు, జేసీబీలు ఉపయోగించి పగులగొట్టే చర్యలు చేపట్టారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై ఎందుకు కఠిన చర్యలు తీసుకోలేకపోయారంటూ నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదులు, ఆరోపణలు నేపథ్యంలో కనకమహల్ థియేటర్ ఖాళీ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలకు కారణమయ్యారంటూ ఎస్‌ఎంసీ అధికారులు టౌన్ ప్లానింగ్‌లో ఇన్‌చార్జిగా టీపీబీఓగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేష్, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ సీహెచ్ శివకుమార్‌ను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అనధికార నిర్మాణాన్ని మాత్రం తొలగించే చర్యలు చేపట్టకుండా వదిలేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కనకమహల్ ఖాళీ స్థలంలో అనుమతుల్లేకుండా రెండంతస్తుల నిర్మాణం

క్లుప్తంగా

19, 20 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా పెన్‌డౌన్

నెల్లూరు సిటీ: సమస్యలు పరిష్కరించాలంటూ ఈనెల 19, 20వ తేదీల్లో డాక్యుమెంట్ రైటర్లు పెన్‌డౌన్ నిర్వహిస్తారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెనుమాక వెంకటసుబ్బారావు మంగళవారం తెలిపారు. నెల్లూరులోని ఆర్‌ఓ కార్యాలయం వద్ద రెండోరోజు రైటర్ల పెన్‌డౌన్ కొనసాగింది. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు, డాక్యుమెంట్ రైటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు బాల వెంకటఅశోక్ తదితరులు పాల్గొన్నారు.

నల్లరాతి మడుగులో పడి..

• బాలుడి మృతి


శివరాం మృతదేహం

వరికుంటపాడు: మండలంలోని జి.కొండారెడ్డిపల్లి పంచాయతీ కొత్తపల్లిలో మంగళవారం నల్లరాతి మడుగులో పడి ఓ బాలుడు మృతిచెందాడు. శాగం శివరాం (15) గేదెలు మేపడానికి గంగిరెడ్డి అనే వ్యక్తితో కలిసి మడుగు వద్దకు వెళ్లాడు. గంగిరెడ్డి దానిని దాటి గేదెల కోసం వెళ్లగా, శివరాం మాత్రం దాటే క్రమంలో లోతు ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగిపోయి చనిపోయాడు. శివరాం స్వస్థలం మర్రిపాడు మండలం సన్నవారిపల్లి. కుటుంబ ఆర్థిక సమస్యలతో బతుకుదెరువు కోసం కొత్తపల్లిలో ఉన్న మేనమామ వద్దకు వచ్చి గేదెలు మేపుతున్నాడు.

బాలికతో అసభ్యప్రవర్తన


• నిందితుడిపై పోక్సో కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): తండ్రి స్థానంలో ఉంటూ బాగోగులు చూసుకుంటానని నమ్మించిన ఓ వ్యక్తి బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. ఉదయగిరి ప్రాంతానికి చెందిన ఓ మహిళ భర్త అనారోగ్యంతో ఏడాది క్రితం మృతిచెందాడు. ఆమెకు కుమారుడు, పద్నాలుగేళ్ల కుమార్తె ఉంది. ఈక్రమంలో ఆ మహిళకు నెల్లూరు బీవీ నగర్‌కు చెందిన కిశోర్‌తో పరిచయమైంది. అతను ఆమెను, పిల్లల్ని బాగా చూసుకుంటానని నమ్మించాడు. వారి కోసం కొండాయపాళెంలో ఇంటిని తీసుకున్నాడు. మహిళ తరచూ కిశోర్‌ను కలిసేందుకు నెల్లూరుకు వచ్చేది. గతనెల 30వ తేదీన ఆమె తన కుమార్తెతో కలిసి వచ్చింది. బాలికను ఇంట్లో వదిలి పక్కింటి వారితో కలిసి బయటకు వెళ్లింది. ఇంటికొచ్చిన కిశోర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈక్రమంలోనే ఆ మహిళ రావడంతో అతను వెళ్లిపోయాడు. బాలిక జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పి కన్నీటిపర్యంతమైంది. మంగళవారం ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్

కావలి(అల్లూరు): వ్యక్తిపై హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై గోపీచంద్ మంగళవారం వివరాలు వెల్లడించారు. కావలి రెండో టౌన్ పరిధిలోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నెల్లూరు టౌన్‌కు చెందిన దేవిరెడ్డి నరేంద్రపై గత శనివారం కావలి కసాయివీధికి చెందిన ఒంగోలు సాయికుమార్ దాడి చేశాడు. బీరు బాటిళ్లతో హత్యాయత్నం చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు.

22 నుంచి 'కోన'లో శరన్నవరాత్రి ఉత్సవాలు



రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఆదిలక్ష్మీదేవికి ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 22న సౌభాగ్యలక్ష్మీదేవి, 23న ఆదిలక్ష్మీదేవి, 24న ధాన్యలక్ష్మి, 25న ధైర్యలక్ష్మి, 26న గజలక్ష్మి, 27న సంతానలక్ష్మి, 28న విజయలక్ష్మి, 29న విద్యాలక్ష్మి, 30న రాజ్యలక్ష్మి, అక్టోబర్ 1న ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నట్లు వివరించారు. 2న విజయదశమి సందర్భంగా లక్ష్మీనరసింహస్వామికి అభిషేకం, పూలంగిసేవ తదితర పూజలు, 11 గంటలకు కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రోజూ అమ్మవారికి ఉదయం నవకలశ స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు ప్రత్యేకాలంకరణ, క్షేత్రోత్సవం ఉంటుందని తెలియజేశారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	:రూ.150
లేయర్	:రూ.115
బ్రాయిలర్ చికెన్	:రూ.264
స్కిన్‌లెస్ చికెన్	:రూ.290
లేయర్ చికెన్	:రూ.195

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	:రూ.40
సన్నవి	:రూ.25
పండ్లు	:రూ.15



హేయమైన చర్య

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూ, ప్రజల పక్షాన నిలబడుతున్న సాక్షికి చెందిన ఎడిటర్, జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం హేయమైన చర్య. విలేకరులను అరెస్ట్ చేసి వారిని భయాందోళనకు గురి చేయాలనే విధంగా నేటి కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం.


– అరిగెల నాగేంద్రసాయి, సీపీఐ జిల్లా కార్యదర్శి



కేసులు పెట్టడం దారుణం

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పత్రికా స్వాతంత్ర్యాన్ని హరిస్తోంది. ప్రజా సమస్యలపై వార్తలు రాస్తున్న సాక్షి ప్రతినిధులపై కక్షపూరితంగా కేసులు పెట్టడం దారుణం. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదు. సాక్షిపై పెడుతున్న కేసులను ఆపివేయాల్సిన అవసరం ఉంది.

– కె.రాంబాబు, ఇండియన్ ఫెడరేషన్ ట్రేడ్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా కన్వీనర్



నిర్లక్ష్యం కొంప ముంచేనా?

- భగత్‌సింగ్‌కాలనీకి రక్షణగా రిటైనింగ్ వాల్ నిర్మాణం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొంతమేర జరిగిన పనులు
- కూటమి వచ్చాక ఆపేసిన వైనం
- పూర్తి చేసి ఉంటే కాలనీ సేఫ్


భగత్‌సింగ్ కాలనీలోకి వరద నీరు వెళ్లకుండా రక్షణగా నిలిచిన వాల్

నెల్లూరు (వీఆర్సీసెంటర్): కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన పనులు పూర్తి చేయకుండా గాలికొదిలేసింది. సోమశిల జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తే నెల్లూరులోని కొన్ని ప్రాంతాలు వణికిపోతాయి. ప్రధానంగా పెన్నానది పక్కనున్న 54వ డివిజన్‌లోని భగత్‌సింగ్ కాలనీని వరదనీరు ముంచెత్తేది. ఈ ప్రాంతంలోని వందలాది ఇళ్లు నీటిలో మునిగిపోయి పెద్దఎత్తున ఆస్తి నష్టం సంభవించేది. వరద నీటిలో పిల్లలు, సామగ్రితో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడే దృశ్యాలు కనిపించేవి. ఎంతోమంది నిరాశ్రయులై పునరావాస కేంద్రాల్లో బిక్కుబిక్కుమంటూ ఉండేవారు. వరద తగ్గాక ఇంటికెళ్లి అష్టకష్టాలు పడి శుభ్రం చేసుకునేవారు. ఈ పరిస్థితులు తప్పించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది.


భగత్‌సింగ్ కాలనీ నేడిలా..

నిధుల మంజూరు

గతంలో వరదలు రాగా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భగత్‌సింగ్ కాలనీకి వచ్చారు. అప్పటి మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్ సమస్యను ఆయనకు చెప్పారు. దీంతో పెన్నా నదికి వరదలు వచ్చిన సమయంలో కాలనీలోని నీరు ప్రవేశించకుండా రూ.100 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి జగన్ నిధులు మంజూరు చేశారు. ఈ క్రమంలో పనులు ప్రారంభించారు. కొంతమేర వాల్ నిర్మాణం కూడా జరిగింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పనులు ఆగిపోయాయి. నాడు జరిగిన వాల్ నిర్మాణం వల్లే నేడు వరద నీరు విడుదలైనా ఇంకా కాలనీలోకి చేరలేదు. అధికారులు హడావుడిగా తాత్కాలికంగా మట్టి కట్ట పనులు చేపట్టారు. అధికారంలోకి వచ్చాక కూటమి సర్కారు స్పందించి మిగిలిన పని చేసి ఉంటే పూర్తి స్థాయిలో రక్షణ ఉండేది.


హడావుడిగా యంత్రాలతో పనులు చేస్తూ..


నెల్లూరు బ్యారేజీ వద్ద దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు


బతుకుదెరువు : పెన్నా నది వద్ద దుస్తులు ఉతికి ఆరేశారిలా..

సోమశిల జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో నెల్లూరు బ్యారేజీ వద్ద పెన్నా నదిలో వరద నీరు ప్రవహిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


ప్రమాదమని తెలిసినా అండర్ బ్రిడ్జి కింద వరద నీటిలో వెళ్తున్న వాహనదారుడు

కూటమి అందించు 'ఎనీటైం మద్యం'

నెల్లూరు(క్రైమ్): మద్యం వ్యాపారులు ఇష్టారాజ్యంగా విక్రయాలు సాగిస్తూ జేబులు నింపుకొనే పనిలో ఉన్నారు. నిబంధనలు అమలు చేయాల్సిన ఎక్సైజ్ శాఖ మామూళ్ల మత్తులో జోగుతోంది. జిల్లాలో 200 మద్యం దుకాణాలున్నాయి. అమ్మకాలు పెంచుకునేందుకు వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. సమయపాలనకు నీళ్లొదిలారు. దుకాణాలు రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించాల్సి ఉంది. అయితే అనేక ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు విక్రయాలు చేస్తున్నారు. మరోవైపు బెల్టుషాపుల నిర్వహణ నేరమని తెలిసినా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మద్యం వ్యాపారం అధికార పార్టీ నేతల చేతుల్లోకి వెళ్లడంతో పట్టణాలు, గ్రామాల్లో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. క్వార్టర్‌పై రూ.40 వరకు మందుబాబుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటుండటంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది.


పొదలకూరురోడ్డులోని ఓ మద్యం షాపులో తెల్లవారుజామున తాగుతూ..

అందరూ సేఫ్

- పెన్నాలో చిక్కుకున్న 18 మంది
- పేకాటాడేందుకు, మద్యం తాగేందుకు వెళ్లి..
- 9 మందిని రక్షించిన అధికారులు
- పోలీస్ భయంతో మిగిలిన వారు ఇతర మార్గాల్లో వెళ్లిన వైనం

నెల్లూరు(క్రైమ్): పెన్నానదిలో చిక్కుకున్న 18 మంది సురక్షితంగా ఉన్నారు. 9 మందిని పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది రక్షించారు. మిగిలిన వారు పోలీసుల భయంతో వివిధ మార్గాల్లో ఇళ్లకు చేరుకున్నారు. సోమశిల జలాశయం నుంచి అధికారులు దిగువకు నీటిని విడుదల చేశారు. సోమవారం రాత్రి భగత్‌సింగ్ కాలనీ వద్ద నీటి ప్రవాహం పెరిగింది. నెల్లూరు నగరంలోని హరనాథపురం, చంద్రబాబునగర్, సంతపేట, జాకీర్‌హుస్సేన్ నగర్, కిసాన్‌నగర్, భగత్‌సింగ్ కాలనీ, కోవూరు మండ బయలు సెంటర్‌కు చెందిన 18 మంది పేకాట ఆడేందుకు, మద్యం తాగేందుకు జాతీయ రహదారి పెన్నా బ్రిడ్జి కింద ఇసుకదిబ్బల్లోకి వెళ్లి నీటిలో చిక్కుకుపోయారు. దీంతో వారు తమను రక్షించాలంటూ పెద్దగా కేకలు వేశారు. అనంతరం 112కు కాల్ చేసి పరిస్థితిని వివరించారు. సమాచారం అందుకున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డి వెంటనే ఘటనా స్థలానికి బయలుదేరారు. అలాగే అగ్నిమాపక అధికారులకు విషయాన్ని తెలియజేశారు. డీఎఫ్‌ఓ వాకా శ్రీనివాసులురెడ్డి ఆదేశాలతో లీడింగ్ ఫైర్‌మెన్ చంద్రశేఖర్ సిబ్బందిని తీసుకుని నూతన బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. బ్రిడ్జిపై నుంచి రోప్‌లు, నిచ్చెన సాయంతో వారు నదిలోకి దిగారు. చిమ్మచీకటిగా ఉండటంతో అస్కాలైట్ ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. తొమ్మిదిమందిని రక్షించి బయటకు తీసుకొచ్చారు.


పెన్నానదిలో ఏర్పాటుచేసిన లైట్, సామగ్రి

గేట్లు మూసి..

ఇరిగేషన్ అధికారులు బ్యారేజీ గేట్లను మూసివేయడంతో నీటి ప్రవాహం తగ్గింది. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు కేసులు నమోదు చేస్తారని భావించిన మిగిలిన తొమ్మిది మంది బయటకు రాకుండా పరుగులు తీశారు. ఏమీ చేయమని వచ్చేయాలని ఇన్‌స్పెక్టర్ మైక్ ద్వారా సూచించినా వారు రాలేదు. పోలీసులు పట్టుకుంటే ఇబ్బంది వస్తుందని భావించిన సదరు వ్యక్తులు వివిధ మార్గాల్లో ఇళ్లకు చేరుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో పోలీసులు తొలుత రక్షించిన వారి నుంచి మిగిలిన వారి ఫోన్ నంబర్లు సేకరించి ఫోన్ చేయగా అందరూ సురక్షితంగా ఉన్నారని తెలియడంతో రక్షణ చర్యలను నిలిపివేశారు. అందరూ క్షేమంగా ఉండటంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. మంగళవారం 18 మందికి నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు.

నమ్మించి.. నగదు తీసుకుని..

• మోసగాడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఒంటరి మహిళను బాగా చూసుకుంటానని నమ్మించి ఆమె వద్ద నగదు తీసుకుని మోసగించిన వ్యక్తిపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. బీవీ నగర్‌కు చెందిన ఓ మహిళ భర్త చనిపోవడంతో తన ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటోంది. పండ్ల షాపులో పనిచేస్తూ వచ్చిన సంపాదనతో వారిని పోషించుకుంటోంది. ఆమెకు రెండేళ్ల క్రితం నార్తు మోపూరుకు చెందిన సందీప్‌తో పరిచయమైంది. అతను ఆమెను, పిల్లల్ని బాగా చూసుకుంటానని నమ్మించాడు. దీంతో ఏడాదిన్నరగా ఇద్దరూ సహజీవనం చేస్తున్నారు. ఈక్రమంలోనే సందీప్ సొంతగా ఆటో కొనుక్కోవాలని ఆమె నుంచి రూ.60 వేలు తీసుకున్నారు. కొద్దిరోజుల అనంతరం అతను ఇంటికి రావడం మానేశాడు. ఆ మహిళ ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అతని స్వగ్రామానికి వెళ్లి ఆరా తీసింది. అప్పటికే సందీప్‌కు వివాహమై పిల్లలున్నట్లు తెలిసింది. దీంతో తనను మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలు

నెల్లూరు(అర్బన్): మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ – నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. జిల్లాలోని 61 పీహెచ్‌సీలు, 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 497 సబ్‌సెంటర్లు, 2 ఏరియా, 10 సామాజిక ఆస్పత్రులు, నగరంలోని జీజీహెచ్ (సర్వజన ఆస్పత్రి)తో కలిపి మొత్తం 591 ప్రదేశాల్లో బుధవారం నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు ప్రతి ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య శిబిరాలు జరుగుతాయి. ఆరోగ్యవంతమైన మహిళ – శక్తివంతమైన కుటుంబం అనే నినాదంతో ప్రత్యేకంగా స్క్రీనింగ్ పరీక్షలను డాక్టర్లు నిర్వహించనున్నారు. అలాగే అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా మహిళలకు సంబంధించి రొమ్ము, నోటి, గర్భాశయ కేన్సర్, గుండె జబ్బులు, చక్కెర వ్యాధి లాంటి జబ్బులను స్క్రీనింగ్ పరీక్షల్లో గుర్తిస్తారు. ఆస్పత్రిలో చేయదగిన చికిత్సలు అందిస్తారు. అవసరమైతే పెద్దాస్పత్రికి రెఫర్ చేస్తారు. యువతుల్లో రక్తహీనత గుర్తించి చికిత్స అందిస్తారు. పిల్లల్లో సికెల్ సెల్ అనీమియా గుర్తించి అవసరమైన వారికి వైద్యసాయం అందిస్తారు. గర్భిణులను పరీక్షించి తీసుకోవాల్సిన పోషకాహారం, రక్తహీనతపై అవగాహన కల్పిస్తారు. పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఆయుష్మాన్‌భారత్ కార్డులు అందజేస్తారు.

ఎంతో ఉపయోగం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.సుజాత మంగళవారం మాట్లాడుతూ మహిళలకు కేంద్రం ప్రభుత్వం చేపట్టిన స్వస్థ్ – నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే తన కుటుంబంలోని సభ్యులను ఆరోగ్యంగా ఉంచుతారని తెలిపారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు, టీచర్లు

• కలెక్టరేట్ ఎదుట ఏపీటీఎఫ్ నిరసన

నెల్లూరు రూరల్: ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు అన్నారు. మంగళవారం నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.దశరథరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ హజరత్ మాట్లాడుతూ ఆర్థిక బకాయిలు విడుదల చేయడంలో, ఇతర ప్రయోజనాలు కల్పించడంలో ప్రభుత్వం ఏ మాత్రం ఉద్యోగులపక్షం వహించడం లేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. యాప్‌ను, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. అనంతరం జేసీ కార్తీక్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కండలేరులో 47.190 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 47.190 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,000 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,250, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృత్యువాత



నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో?, మరే ఇతర కారణమో తెలియదు గానీ గుర్తుతెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పాత చెక్‌పోస్టు సమీప పెన్నా బ్రిడ్జి వద్ద ఈనెల 14వ తేదీన సుమారు 55 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. 108 అంబులెన్స్‌లో సదరు వ్యక్తిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. బోడిగాడితోట 5వ వార్డు వీఆర్వో భాస్కరయ్య ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు 94407 96310, 94407 96306 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డి కోరారు.

మోటార్‌బైక్ అదుపుతప్పి..

• యువకుడికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన బాలాజీ

సంగం: మండల కేంద్రమైన సంగం – కలిగిరి రహదారిలో మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. పెరమన పంచాయతీ మజారా జంగాలదొరువుకు చెందిన బాలాజీ అనే యువకుడు పని నిమిత్తం బైక్‌పై హసనాపురం వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తూ సంగం – కలిగిరి రహదారిలోని ఆర్చ్ వద్ద ఏం జరిగిందో గానీ బైక్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. సంగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు


మాట్లాడుతున్న నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం కార్మికులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. దీంతో అక్టోబర్ 15వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.